'కూటమి' తీరుతో
నాపరాళ్ల పరిశ్రమ కుదేలు

- మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వ తీరుతో నాపరాళ్ల పరిశ్రమ నష్టాల ఊబిలోకి కూరుకుపోతోందని మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. నాపరాళ్ల పరిశ్రమ యజమానులు, కార్మికులు ఇబ్బందులు పడే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బేతంచెర్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు వసీమ్ అక్రమ్, జావద్ అక్రమ్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి మాజీ మంత్రి హాజరయ్యారు. ఈసందర్భంగా బుగ్గనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పారిశ్రామిక వేత్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాపరాళ్ల సీనరేజ్ పన్నుల వసూలును కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించడంతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్నారు. నాపరాళ్ల రవాణా నిలిచిపోయిందని, సీనరేజ్ పన్నుల వసూలును ప్రైవేటుకు అప్పగించడంతో ఎలాంటి సమస్యలు వస్తాయో అర్థం కావడం లేదని పరిశ్రమల యజమానులు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాపరాళ్ల పరిశ్రమలో కష్టనష్టాలను అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రైవేటుపరం చేయకుండా నిలిపివేయించామని మాజీ మంత్రి బుగ్గన గుర్తు చేశారు. పరిశ్రమల యజమానులు, కార్మికులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇక్కడి పరిస్థితులను చూసి నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వార్డు కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, ఇబ్రహీమ్, రాష్ట్ర గిడ్డంగుల శాఖ, ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌మాజీ డైరక్టర్లు బాబుల్ రెడ్డి, మూర్తుజావలి, ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్ తదితరులు పాల్గొన్నారు.


పరిశ్రమల యజమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

బుగ్గనను కలిసిన సుధాకర్‌రెడ్డి



డోన్: వైఎస్సార్‌సీపీ డోన్ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన దేశం సుధాకర్ రెడ్డి శుక్రవారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పార్టీ నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, రజనీరెడ్డి, దినేష్‌గౌడ్, బొబ్బల శివరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్ తదితరులు ఉన్నారు.

శుభకార్యంలో బుగ్గన


వధూవరులతో బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, చంద్రలక్ష్మి దంపతుల కుమారుడు రాజ్‌కుమార్, ప్రియాంక భార్గవి వివాహ రిసెప్షన్ శుక్రవారం డోన్‌లోని ఎం కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు దేశం సుధాకర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు హాజరయ్యారు.

క్లుప్తంగా

సీపీఆర్ ద్వారా బతికించే అవకాశం


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్యాపిలి: అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం ద్వారా మనిషిని బతికించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయుష్ డాక్టర్ రాజారావు, స్టాఫ్ నర్సు మల్లికార్జున అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం సీపీఆర్ చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని తక్షణమే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. సీపీఆర్ చేసే విధానం ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడు, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్న, ఫార్మాసిస్టు శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలు అందుకుంటున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు మండ్ల మహిధర్‌రెడ్డి సహకారంతో నోటుపుస్తకాలు, పెన్నులను జేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జునరా, ఉపాధ్యాయులు సురేష్, నాగమల్లేశ్వరుడు, మధుకిశోర్, సీఆర్‌పీ ప్రభాకర్ పాల్గొన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ


పంపిణీని ప్రారంభిస్తున్న ఏఓ


అవుకు(కొలిమిగుండ్ల): రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీని శుక్రవారం చెన్నంపల్లెలో ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి ఖలీమున్నీసా తెలిపారు. మండలానికి 1200 క్వింటాళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. క్వింటా రూ.7,850 కాగా 25 శాతం సబ్సిడీ రూ.1,950 పోను రైతులు రూ.5,850 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాల కోసం ఇప్పటికే రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. శనగ విత్తనాలను విత్తన శుద్ధి చేసేందుకు ట్రైకోడెర్మ విరిడిని పది గ్రాములకు కేజీ చొప్పున కలిపి విత్తుకోవాలని సూచించారు.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం


కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా విశేష సేవలందించిన అబ్దుల్ కలామ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ముద్దవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుధీంద్ర అన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కలాం జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మధు సుధాకర్ రెడ్డి, సభ్యులు వలిబాషా, కేశవనాయుడు, వన్నూర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ పండుగ


ఆకుమల్లలో దస్తగిరిస్వామి

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో శుక్రవారం దస్తగిరిస్వామి గ్యార్మీ పండుగను కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దస్తగిరి స్వామికి భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. కమిటీ సభ్యులు ఉసేన్‌రెడ్డి, సులేమాన్, కమాల్ బాషా భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం దస్తగిరిస్వామిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

డోన్ టౌన్: మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కిట్టు (48) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కర్‌రెడ్డి, శివరామ్‌లు గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం యూనియన్ తరఫున రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందజేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి నిరసన


కోవెలకుంట్ల: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


సంజామలలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు


డోన్: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు


ప్యాపిలిలో..

కోవెలకుంట్ల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు శుక్రవారం పట్టణంలోని జమ్మలమడుగు చౌరస్తాలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయా సంఘాల నాయకులు నవీన్, రామసుబ్బయ్య మాట్లాడుతూ.. ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసిరిన రాకేశ్ కిషోర్ అనే న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాద వృత్తికి అనర్హుడిగా భావించి బార్ కౌన్సిల్ నుంచి తొలగించాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు పరుశురామ్, నాగరాజు, లక్ష్మీనారాయణ, రవితేజ, ఠాగూర్, బాలు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

సంజామల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంజామల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణకు వినతిపత్రం అందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మిద్దె వెంకట రమణ, పెద్దన్న, శివరాముడు, ఓబులేసు, రత్నం పాల్గొన్నారు.

డోన్‌లో నిరసన ర్యాలీ

డోన్ టౌన్: సీజేఐపై దాడి అమానుషమని.. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నేత గుండాల ఈశ్వరయ్యమాదిగ అన్నారు. శుక్రవారం కొండపేట నుంచి పాత బస్టాండ్ మీదుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నరాయుడు, మండల అధ్యక్షుడు సంజీవమాదిగ, దళిత నాయకులు పులిపెద్దయ్య, శ్రీను, చిరంజీవి, కంబయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

- **ప్యాపిలి:** మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సుందరం, శివ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

ప్యాపిలి: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు బాక్సింగ్‌లో సత్తా చూపారు. ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరిగిన 69వ ఎస్జీఎఫ్ ఏపీ అంతర్ జిల్లా టోర్నమెంట్‌లో తమ పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నట్లు హెచ్‌ఎం సరళా దేవి, పీఈటీ విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. బాక్సింగ్‌లో ఎం.అర్చన, కబిహ గోల్డ్ మెడల్, దివ్య అమృత సిల్వర్, హసీనా, హేమలత, హారిక బ్రాంజ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన అర్చన, కబిహ త్వరలో జరగనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.


ప్యాపిలి జెడ్పీ స్కూల్ విద్యార్థినులు

పాడిపశువుల యూనిట్లు మంజూరు


మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ ఏడీఏ నాగరాజు

డోన్: డీఆర్‌డీఏ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపులక్ష్మి మహిళలకు పాడిపశువులు, గొర్రెలు, మేకల యూనిట్లను అందజేయడానికి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో డీఆర్‌డీఏ ప్రణాళిక అధికారి కరుణ, పశుసంవర్ధక శాఖ సంచాలకుడు దామోధర్ నాయుడు ఆదేశాల మేరకు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య అధికారి డాక్టర్‌పద్మావతి, డాక్టర్ భాను, నవ్య, పాల్గొన్నారు.

టపాకాయల ధరలను నియంత్రించాలని వినతి

బేతంచెర్ల: టపాకాయల ధరలను పెంచకుండా అదుపులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మేనేజర్ సువర్ణ లక్ష్మికి ఫెడరేషన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. బహిరంగ ప్రదేశాల్లో ఒకే చోట దుకాణాలను ఏర్పాటు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.



నగర పంచాయతీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

నిరసన గళం


బనగానపల్లె ఎన్నికల డీటీ మంజులకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

సాక్షి దినపత్రికపై కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డితో పాటు పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ శుక్రవారం బనగానపల్లె, డోన్‌లో ధర్నా నిర్వహించారు. డోన్ ఆర్డీఓ నరసింహులు, బనగానపల్లె ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మంజులకు వినతిపత్రాలు అందజేశారు. ఏపీ డబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ మద్దయ్య యాదవ్, బనగానపల్లె డివిజన్ అధ్యక్షుడు సర్వేశ్వరరెడ్డి, డోన్‌లో జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు శేఖర్, వడ్డె నాగరాజు, రాజు పాల్గొన్నారు.

–బనగానపల్లె/డోన్

నేడు వాహనాల వేలం

డోన్ టౌన్: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఆరు వాహనాలను (బైక్‌లు, స్కూటర్లు) శనివారం ఉదయం 10 గంటలకు డోన్ ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేస్తామని ఆ శాఖ సీఐ వరలక్ష్మీ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ వేలంలో పాల్గొనవచ్చని, వివరాలకు ఎక్సైజ్ కార్యాలయం లేదా 7989059422 నంబరును సంప్రదించాలని సూచించారు.

వేలంలో రూ.80 వేల ఆదాయం

కొలిమిగుండ్ల: కార్తీక మాసం సందర్భంగా బందార్లపల్లె సమీపంలోని నేల బిలం మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టెంకాయల వేలం పాట నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 30 మందికి పైగానే పాల్గొన్నారు. బందార్లపల్లెకు చెందిన సంజీవరాయుడు రూ.80 వేలకు దక్కించుకున్నాడు. కార్తీక మాసం ముగిసే వరకు ఆలయం వద్ద టెంకాయలు విక్రయించుకోవచ్చని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయం ఆలయాభివృద్ధికి ఉపయోగిస్తామని చెప్పారు.

నేడు లేఔట్ యజమానులతో సమావేశం

బేతంచెర్ల: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు లేఔట్ యజమానులతో ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. 2025 జూన్ 30లోపు రిజిస్టర్ చేసిన ప్లాట్లు మాత్రమే రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఉంటుందని చెప్పారు. సంబంధిత యజమానులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని పాతపాడు, పసుపల, బనగానపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు సరఫరా చేసే ఉచిత విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 5 గంటల వరకు సరఫరా చేస్తామని తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

- **డోన్ టౌన్:** స్థానిక పేరంటాలమ్మ గుడి వద్దనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నల్లగుట్ట, శ్రీరామనగర్ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ప్లింత్ ఎత్తు పెంచే పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆయా కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు.

భవిత కేంద్రానికి ఫ్యాన్లు వితరణ


ఫ్యాన్లు, బొమ్మలు అందజేస్తున్న సమితి ప్రతినిధులు

డోన్ టౌన్: పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో ఉన్న భవిత కేంద్రానికి దాతల ఆర్థిక సాయంతో వివేకానంద సేవా సమితి ప్రతినిధులు శుక్రవారం ఫ్యాన్లు, సైకిల్, బొమ్మలు అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్ మాట్లాడుతూ.. దాతలు జగన్మోహన్, ఏవీ రావు ఆర్థిక సహకారంతో వీటిని అందించినట్లు తెలిపారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమే


మాట్లాడుతున్న ఎస్ఐ దుగ్గిరెడ్డి

బనగానపల్లె రూరల్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కేజీబీవీ ఉర్దూ పాఠశాలలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ''బాలికగా నాతోనే మార్పు'' అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎస్ఐ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో బాలురతో సమానంగా బాలికలు కూడా అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల కోసం అనేక అవకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థినులు చదువుకునే వయసులో టీవీ, వాట్సాప్, ఫేస్‌బుక్‌లకు దూరంగా ఉండి, తమ లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. తరువాత అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలాంజనేయులు, ఎంఈఓ స్వరూప, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రేణుకాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుగుణమ్మ, చిట్టెమ్మ, శైలజ, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు


ర్యాలీ నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, అధికారులు

బనగానపల్లె రూరల్: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వల్ల అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలాంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పెట్రోల్‌బంకు, ఆస్థానం రోడ్డు, పోస్టాఫీస్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా బాలాంజనేయులు మాట్లాడుతూ, తగ్గిన జీఎస్టీ స్లాబ్‌ల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు లబ్ధి పొందుతారని, దీని వల్ల ఆర్థికాభివృద్ధికి దోహదం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కల్లాల్లో మొక్కజొన్నపై కప్పి ఉంచిన ప్లాస్టిక్ పట్టలు

వీడని వర్షాలతో రైతుల ఆవేదన

- తేమతో మొలకెత్తుతున్న గింజలు

బనగానపల్లె: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 10 వేల హెక్టార్లలో ఈ పంట సాగు చేశారు. అధిక దిగుబడి, లాభదాయక పంటగా భావించి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు ప్రస్తుతం నష్టాల్లో కూరుకుపోతున్నారు. పది రోజులుగా పంటను కల్లాల వద్దకు తరలించి విక్రయానికి సిద్ధం చేసుకున్న రైతులు, వరుస వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచినా, వర్షం ఆగకపోవడంతో తేమ పెరిగి మొక్కజొన్న మొలకెత్తడం ప్రారంభమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట తడవడంతో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. గిట్టుబాటు ధర కూడా ఇవ్వడంలేదని రైతులు వాపోతున్నారు. గత సంవత్సరం క్వింటాల్‌కు రూ.2,200 లభించగా, ఈ సంవత్సరం రూ.2000 మించకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఆరబెట్టిన మొక్కజొన్న

నేడు మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.